# కథ

## వి.ఎస్.ఎన్.మూర్తి

# సెంట్రల్ సర్వర్

ఆ రోజు సుబ్రావ్‌కు మా చెడ్డ ఆకలిగా వుంది. గతంలో అయితే ఇంటినిండా సామగ్రి వుండేది. అర్జెంట్‌గా ఏదో ఒకటి చేసుకుని తినేసేవాడు. ఎందుకంటే సుబ్రావ్ బామ్మ, చిన్నప్పుడు ఇతగాడి ఆకలిని చూసి, ముందుచూపుతో అయిదు నిమిషాల్లో అరవై రకాలు అన్న చందంగా రకరకాల వంటలు నేర్పించింది. అది కాస్తా సుబ్రావ్ భార్య సుబ్బలక్ష్మికి వరంగా మారింది. ఎప్పుడు ఏది కావాలంటే అది అతగాడే చేసుకోవడం ప్రారంభించాడు.

కానీ ఇప్పుడు రోజులు మారాయి. అసలే 2025 సంవత్సరం. టెక్నాలజీ ఫుల్లుగా పెరిగిపోయి, మనిషిని మింగేస్తున్న కాలం. నూరు..నూట యాభై చదరపు అడుగుల 'నేను.. నువ్వు' అన్న మొగుడూ పెళ్లాలకే పరిమితమైన ఇళ్లు, అదీ అరవై ఆరో అంతస్తులో, అలవాటైపోయింది. అందువల్ల ఇంటిలో స్టాకు సంగతి దేవుడెరుగు... ఎప్పటికప్పుడు రెడీమేడ్ ఫుడ్ కొనుక్కుని, చటుక్కున లాగించెడం మా బాగా అలవాటైపోయింది. అదీ పరిస్థితి.

అలాంటి 2025లో ఓ సాయంకాలం...

సుబ్రావ్‌కు మా చెడ్డ ఆకలి వేసింది. వెంటనే ఫోన్ లిఫ్ట్ చేసి, స్పీడ్ డయల్‌లో 'పిజ్జా మే సవాల్' స్టోర్‌కు ఫోన్ చేసాడు.

"వెల్‌కమ్ పిజ్జామే సవాల్..మీకు పిజ్జా కావాలంటే ఒకటి నొక్కండి..బర్గర్ కావాలంటే రెండు నొక్కండి" అంటూ కాల్‌సెంటర్ మెనూని కిలకిలా రావంతో ఒలకపోసింది.

ఆపరేటర్ నెంబర్ 99 నొక్కాడు సుబ్రావ్. పావు గంట మూజిక్కిచ్చి లైన్లోకొచ్చింది ఆపరేటర్. అప్పటికే అతగాడి ఆకలి పావుసగం చచ్చింది.

"నాకొక పిజ్జా కావాలి" అన్నాడు ఎప్పుడిదో పాత పాట స్టయిల్‌లో.

"సార్..ముందు మీ పీపుల్స్ ఇండెక్స్ నెంబర్ చెబుతారా" అని వినిపించింది అవతలినుంచి.

వెంటనే .. "123456789987654321" అని బదులిచ్చాడు సుబ్రావ్.

"థాంక్స్ సుబ్రావ్‌గారూ..మీరు ఆర్ ఎక్స్ ఎవెన్యూ. అరవై ఆరో ఫ్లోర్, ఆరో నెంబర్ నుంచి కాల్ చేస్తున్నారు కదూ" అని అడిగిందా కోకిల.

"అవునమ్మా..నాకు ఓ పిజ్జా.." అనబోయాడు నీరసంగా.

"సరే..మీ ఫోన్ నెంబర్లు 9876940572, 9760467201, లాండ్‌లైన్ 98675456, కదా" అంది మళ్లీ.

"అవును తల్లీ..ఇంతకీ పిజ్జా..." అన్నాడు నీరసం పెరిగి... ఆకలి క్రమేపీ తగ్గుతున్న ఫీలింగ్.

"మీరు సిన్ఫోసిస్ గ్రిప్రో అనే కంపెనీలో పనిచేస్తున్నారు కదా"

"అమ్మా..నా బయోడేటా అంతా దగ్గర పెట్టుకున్నావా?" కాస్త విసుగ్గా అన్నాడు.

"సరే..మీ పీపుల్ ఇండెక్స్ నెంబర్‌తో సెంట్రల్ సర్వర్‌కు అటాచ్ అయ్యాను సర్" అంది వినయంగా.

"మంచిది. ఇంతకీ నాకు ఓ పన్నీర్ పిజ్జా అర్జంట్‌గా పంపిస్తావా?" అన్నాడు సుబ్రావ్. అప్పటికే గొంతు నీరసించింది.

"కుదరదు సార్"

"ఏం ఎందుకని?" లేని శక్తి తెచ్చుకుని అరిచాడు.

"సార్ మీకు ఇప్పటికే కొలెస్ట్రాల్ ఎక్కువగా వుందని మీ మెడికల్ రిపోర్టులు చెబుతున్నాయి. సార్..మీరు అందుకని మేం కొత్తగా ఇంట్రడ్యూస్ చేసిన లైట్ డైట్ పిజ్జా తీసుకోవాలి. పైగా లైట్ డైట్ గురించి మీరు నెల రోజుల క్రితం సెంట్రల్ లైబ్రరీ నుంచి పుస్తకం తెచ్చి ఇంతవరకు రిటర్న్ ఇవ్వలేదు. దానికి ఫైన్ కూడా పడిందని మా కంప్యూటర్ చెబుతోంది"

"అఘోరించినట్లే వుంది. సరే అదయినా పంపుతావా?" మరోసారి అరిచినట్లు అడిగాడు.

"సార్ బిల్ క్రెడిట్ కార్డుపైన పే చేయడానికి వీల్లేదు సార్. క్యాష్ ఇవ్వాలి" మళ్ళీ కోకిల నోట మరో కండిషన్.

"ఏం ఇదో కొత్త రూలా?"

"కాదు సర్. మీ క్రెడిట్ కార్డు లిమిట్ దాటింది. ఇప్పటికే 48 వేల ఆరు వందల, అరవై తొమ్మిది రూపాయలు ఓవర్ ద్యూ వున్నారు. దీనికి ఈ నెల వడ్డీ ఇంకా కలపలేదు"

సెంట్రల్ సర్వర్ సిస్టమ్‌ను మనసులో తిట్టుకుంటూ.."సరే అఘోరించండి. డెబిట్ కార్డుపై కిందనున్న ఏటియమ్‌కు వెళ్లి డ్రా చేసి ఇస్తాను. పంపించండి"

"కుదరదు సార్. మీ డెబిట్ కార్డుపై ఇవాళ్టికి ఇప్పటికే లిమిట్ మేరకు డ్రా చేసినట్లు కంప్యూటర్లో చూపిస్తోంది సార్"

"అమ్మా..తల్లీ నా దగ్గర డబ్బులున్నాయి. ఇస్తాను. పంపిస్తారా"' ఎంత ఓపిక మిగిలిందో..ఆమేరకు అరిచాడు సుబ్రావ్.




"తప్పకుండా సార్. గంట పడుతుంది. ఇంకా అర్జెంట్‌గా కావాలంటే మీ స్కూటరు నెంబరు ఎపి 31 59673 పై కానీ, కారు నెంబరు ఎపి 30 39572 పై కానీ వచ్చి తీసుకెళ్లండి"

"ఓసి నీ..ఈ వివరాలు కూడా అఘోరించాయా..సరే కానీ..పిజ్జాతో ఫ్రీ పెప్సీ పంపుతున్నావా"

"లేదు సార్. మీకు కుదరదు" కరాఖండీగా చెప్పింది కాల్‌సెంటర్ కోకిల.

"ఏం ఎందుకని?"

"మీ రికార్డుల ప్రకారం మీరు డయాబిటిక్. మీరు పెప్సీ తాగకూడదు..."

ఇంకా ఏదో చెప్పుకుపోతోంది కోకిల.

రిసీవర్ కిందపడేసి పరుపుపై వాలిపోయాడు సుబ్రావ్ నీరసంగా. ○